క్లుప్తంగా

డిప్యూటీ డీఈఓ తనిఖీ



సీతారామపురం : మండలంలోని ఓగూరువాండ్లపల్లి, అయ్యవారిపల్లి, సీతారామపురం జెడ్పీ హైస్కూళ్లను ఆత్మకూరు డిప్యూటీ డీఈఓ గోపాల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించి తగిన సూచనలు చేశారు. అనంతరం భవన నిర్మాణాలను పరిశీలించారు. ఎంఈఓ మస్తాన్‌వలీ, ఆయా హైస్కూళ్ల హెచ్‌ఎంలు కొండయ్య, శ్రీనివాసులు, షఫీఅహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

• **మర్రిపాడు :** మర్రిపాడు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆత్మకూరు డిప్యూటీ డీఈఓ గోపాల్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు సమావేశాలను నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు జ్యోతి, ధనలక్ష్మి, హెచ్‌ఎం పద్మలత, రిసోర్స్‌పర్సన్‌లు రాజేంద్రకుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్యశిబిరం



అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

మర్రిపాడు : మండలంలోని వెంకటాపురం ఎస్సీ కాలనీలో కృష్ణాపురం మంగళవారం కూడా వైద్యశిబిరం కొనసాగించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులకు రక్తపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఇంటింటికీ తిరిగి ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించారు. అపరిశుభ్ర ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. అనంతరం వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణాధికారి షేక్ జావీద్, ఎంఎల్‌హెచ్‌పీ భూలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ డి.రమణయ్య, కె.రమణయ్య, ఏఎన్‌ఎం రసూల్‌బీ పాల్గొన్నారు.

ఎమ్మార్సీలో ఫిజియోథెరపీ క్యాంపు



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యురాలు చాముండేశ్వరి

సీతారామపురం : సీతారామపురం ఎమ్మార్సీ భవనంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ క్యాంప్‌ను మంగళవారం నిర్వహించారు. ఎంఈఓ మస్తాన్‌వలీ పర్యవేక్షణలో ఫిజియోథెరపిస్ట్ చాముండేశ్వరి పాల్గొని సేవలందించారు. ప్రతి మంగళవారం నిర్వహించే క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐఈఆర్టీలు విజయ్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పశుగణన సర్వే పక్కాగా జరగాలి



పశుగణన సర్వేను పరిశీలిస్తున్న ఏడీ శశిధర్

సీతారామపురం : గ్రామాల్లో పశుగణన సర్వేను పక్కాగా నిర్వహించాలని పశుసంవర్ధకశాఖ ఉదయగిరి ఏడీ శశిధర్ అన్నారు. మండలంలోని చిన్నాగంపల్లిలో జరుగుతున్న పశుగణన సర్వే తీరును ఆయన మంగళవారం పరిశీలించారు. గ్రామాల్లో పశువైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పశువులు, కోళ్లు, ఇతర మూగ జీవాల వివరాలను సమగ్రంగా సేకరించి నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏహెచ్‌ఏలు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి ఆభరణాల సమర్పణ



ఆభరణాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

సంగం : సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సహకారంతో అమ్మవారికి కాసులహారం, వడ్డానం, తాళిబొట్టు సమర్పణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ ఆభరణాలను పల్లకిపై ఉంచి గ్రామోత్సవం చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి ఆభరణాలను అలంకరించారు.



చిన్న పిల్లలు ఆడుకునేలా ఏర్పాటు చేసిన సాధనాలు

ఆహ్లాద వనం

కనుచూపు మేర పచ్చదనం, అడవిని తలపించే పరిసరాలు, ఆహ్లాద పరిచే చల్లని గాలులు, ఆకర్షించే జంతువుల బొమ్మలు ఇలా పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా నగర వనాలు రూపుదిద్దుకుంటోంది. జంగిల్ లాంటి కావలి పట్టణ ప్రజలకు ఆట విడుపుగా ఉదయగిరి రోడ్డులో 125 ఎకరాల్లో నగర వనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు పది కిలోమీటర్ల దూరంలో ముంగమూరు వద్ద ఒక నగర వనాన్ని, ఉత్తరం వైపున పది కిలోమీటర్ల దూరంలో చేవూరు వద్ద మరో వనాన్ని నిర్మిస్తున్నారు.

• కావలిలో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంటున్న నగర వనాలు
• నెలాఖరులో రెండు ప్రారంభం

కావలి : కేంద్ర పర్యావరణం, అటవీ మంత్రిత్వ శాఖ 2020–21 నుంచి 2024–25 మధ్య ఐదేళ్లలో 'నగర వనాల యోజన'ను ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా 400 నగర వనాలు, 200 నగర వాటి



ఓపెన్ జిమ్



కావలి పట్టణంలోని నగరవనం స్వాగత ఆర్చి

కలను అభివృద్ధి చేయడమే పథకం లక్ష్యం. ఇందులో భాగంగా పట్టణ పరిధిలోని ఉదయగిరి రోడ్డులో బాపూజీనగర్‌ను ఆనుకుని ఉన్న రక్షిత అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. కావలి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కె.రామిరెడ్డి పర్యవేక్షణలో ఇక్కడ పనులను శరవేగంగా పూర్తి చేసుకుని చివరి దశకు వచ్చాయి. ఈ నగర వనంలో యోగా కేంద్రం, వాకింగ్ ట్రాక్‌లు, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్, క్యాంటీన్, మినరల్ వాటర్ ప్లాంట్, టాయ్‌లెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ఎకో టూరిజానికి పెద్దపేట

కేంద్ర ప్రభుత్వం ఎకో టూరిజానికి పెద్దపీట వేస్తూ పట్టణ ప్రాంతాల్లో భూముల లభ్యత ఆధారంగా నగర వనాల ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కావలి అటవీ రేంజ్ పరిధిలో ఎకో పార్కు ఏర్పాటుకు అనువుగా అటవీ భూమి అందుబాటులో ఉండడంతో పట్టణంతో పాటు, పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలో మరో రెండు కలిపి మొత్తం మూడు నగరవనాల నిర్మాణలు వేగంగా జరుగుతున్నాయి. కాగా ఒక్కో నగర వనానికి రూ.2 కోట్లను ప్రభుత్వం ఇస్తుంది. అయితే ఇప్పటి వరకు రూ.1.40 కోట్లు విడుదల చేసింది. దీంతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా సిద్ధం చేశారు. మరో రూ.60 లక్షలు విడుదల చేయాల్సి ఉంది. నిర్వహణ ప్రజల సహకారంతో చేసుకోవాల్సి ఉంటుంది.

నగర వనంలో ఉండేవి..

అధునాతన ఆట వస్తువులు, జిమ్, మధ్యలో ఫౌంటేయిన్, అంతర్గత రహదారులు, చుట్టూ కంచె వంటి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. నగరవనం చుట్టూ మూడు కిలోమీటర్ల మేర ప్రధాన మార్గాలను, నగరవనం లోపల అంతర్గత రహదారులను నిర్మించారు. ఒకచోట ప్రవేశిస్తే చుట్టూ తిరిగి వనం లోపలికి వచ్చేలా రహదారులను అత్యంత సుందరంగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతానికి విద్యుత్ స్తంభాలు, రెండు బోర్లు తదితర పనులను పూర్తి చేశారు. వేప, నేరేడు, రావి, ఉసిరి, బాదం, ఎర్రచందనం తదితర 15 రకాల చెట్లను వేశారు. వాటికి నీరు అందించడానికి పైప్‌లైన్లను కూడా వేశారు. నగరవనం ప్రవేశం మార్గం వద్ద ఆర్చిని ఆకర్షణీయంగా నిర్మించారు. పక్కనే సెక్యూరిటీ గదిని ఏర్పాటు చేశారు. ఈ పనులు పూర్తి కావడంతో ఈ నెలాఖరుకు అందుబాటులోకి తీసుకురావడానికి అటవీశాఖ అధికారులు కృషి చేస్తున్నారు.

నెలాఖరులో ప్రారంభిస్తాం

ఈ నెలాఖరుకు పట్టణంలోని నగరవనంతో పాటు ముంగమూరులో మరో నగరవనాన్ని ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. చేవూరు వద్ద ఉండే నగరవనాన్ని వచ్చే జనవరిలో ప్రారంభిస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫీజులపై నిర్ణయం తీసుకుంటాం.

– కె.రామిరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, కావలి.

బహుమతుల ప్రదానం



ఆత్మకూరురూరల్ : ఆర్టీసీ సంస్థ అమలు చేస్తున్న గిఫ్ట్ స్కీమ్‌లో భాగంగా ఆత్మకూరు–సోమశిల మార్గంలో ప్రయాణించే వారిలో లక్కీ డ్రా కింద విజేతలకు ఆత్మకూరు డిపోలో మేనేజర్ కరీమున్నీసా మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. సంగం మండల కేంద్రానికి చెందిన బాలాజీ మొబైల్స్ అండ్ ఫ్యాన్సీ అధినేత టి.శ్రీకాంత్ బహుమతులు సమకూర్చారు. లక్కీడ్రా విజేతలు హర్షియా, రాణి బహుమతులు అందుకున్నారు.

సంగంలో ఎన్టీఆర్‌ఎఫ్ బృందాలు



సంగం : సంగంలోని పలు ప్రాంతాల్లో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు మంగళవారం పర్యటించాయి. సంగం సమీపంలో ఉన్న బీరాపేరు వాగును, పెన్నానదిని వారు సందర్శించారు. రాబోయే రోజుల్లో తుఫాన్ సూచనలు ఉన్న నేపథ్యంలో వారు ముందస్తుగా నదులు, వాగులను పరిశీలించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న పోలంగారిపల్లి వాసులు

సీతారామపురం : సీతారామపురంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద పోలంగారిపల్లికి చెందిన పలువురు కూలీలు తమకు ఉపాధిహామీ పనులు కల్పించాలని కోరుతూ మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్ది నెలలుగా గ్రామంలో ఉపాధిహామీ పనులు లేకపోవడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. 350 జాబ్‌కార్డులున్న పోలంగారిపల్లిలో 250 మంది ఉపాధిహామీ పనుల మీదే ఆధారపడి జీవనం సాగిస్తుంటారన్నారు. పనులు కల్పించమంటే ఆడిట్ వరకు ఆగాలని అధికారులు చెప్పడం సమంజసం కాదన్నారు. మండలంలోని 13 పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు కల్పిస్తున్న అధికారులు కేవలం తమ పంచాయతీలో మాత్రం ఎందుకు పనులు కల్పించడం లేదో తెలపాలని పట్టుబట్టారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే వ్యంగ్యంగా సమాధానం ఇస్తున్నారని వాపోయారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ భాస్కర్‌కు అందించారు. దీనిపై ఉపాధి సిబ్బందితో మాట్లాడి పనులు కల్పించేలా చర్యలు చేపడుతామని చెప్పడంతో వారు ఆందోళన ముగించారు.

మర్రిపాడులో సామాజిక తనిఖీ

• రూ.86,322ల రికవరీకి ఆదేశం

మర్రిపాడు : ఉపాధి హామీ పనులపై మండల కేంద్రమైన మర్రిపాడులో సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం జరిగింది. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా రూ.11.26 కోట్ల పనులు నిర్వహించగా, దీనిపై ఆడిట్ జరిగింది. ఇందులో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ.9 కోట్లు, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల కింద రూ.2.26 కోట్ల విలువైన పనులను నిర్వహించినట్లు అధికారులు వివరించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులపై డీఆర్‌పీలు, ఎస్సార్‌పీలు, వీఏలు తనిఖీలు చేశారని, రూ.86,322లు రికవరీ చేయాలని ప్రజావేదిక తెలిపినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని, ఏపీడీ శంకర్ నారాయణ, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎస్ఆర్పీ నీలకంఠం, ఎంపీడీఓ నాగేశ్వరప్రసాద్, ఏపీఓలు వెంకట నారాయణ, సునీల్ పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

బాలల చట్టాలపై అవగాహన

సంగం : సంగంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి సఖి వన్‌స్టాప్ కార్యక్రమం, బాలల రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత, సఖీ అడ్మిన్ షెహనాజ్ పాల్గొని బాలల రక్షణ చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలను అరికట్టడంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సఖీ వన్‌స్టాప్ సెంటర్ పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రిన్సిపల్ సుమతి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.



సఖీ వన్‌స్టాప్ గురించి వివరిస్తున్న అడ్మిన్ షెహనాజ్

ఇందిరాగాంధీకి ఘన నివాళి



కావలి : దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని స్థానిక వెంగళరావునగర్‌లో ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వైద్యాధికారిని రమ్య, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, గ్రంథాలయ అధికారి సునీత తదితరులు ఇందిరాగాంధీ సేవలను కొనియాడారు.

• **ఆత్మకూరు :** పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత ఇందిరాగాంధీ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఆ పార్టీ యూత్ జిల్లా అధ్యక్షుడు వన్నం నాగరాజు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. సయ్యద్ రసూల్, టి.పెంచలయ్య, ఎ.మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

అనుమసముద్రంపేట : బాలల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ఠాగూర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో కొద్దిరోజుల క్రితం నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు ఎంఈఓ సాయిప్రసాద్ చేతుల మీదుగా మంగళవారం బహుమతులను అందజేశారు. కరెస్పాండెంట్ రమణారెడ్డి, దొరస్వామిరెడ్డి పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

కావలి : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలని సామాజిక కార్యకర్త, విశ్రాంత హెచ్‌ఎం సి.శారద కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం మాట్లాడారు. పట్టణంలోని వెంగళరావు నగర్‌లో ఎస్సీ, బీసీ వసతి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని, దీనిని బాగు చేయాలన్నారు. కనీస వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాకాణికి చినజీయర్ ఆశీస్సులు



సోమశిల : సోమశిలలోని పరమానంద ఆశ్రమంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామిని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం రాత్రి కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

కావలి : పట్టణంలోని ముసునూరు ఇందిరమ్మ కాలనీలో జంపాని బ్రహ్మానందం అనే వ్యక్తి తొమ్మిది క్వార్టర్ మద్యం సీసాలను విక్రయిస్తుండగా మంగళవారం అరెస్ట్ చేసినట్లు కావలి రూరల్ సీఐ జి.రాజేశ్వరరావు చెప్పారు. ఎస్సైలు ఎం.బాజీబాబు, సీహెచ్ తిరుమల రెడ్డి, సిబ్బందితో వెళ్లి దాడులు చేసి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

• **మర్రిపాడు :** మండలంలోని చిన్నమాచనూరు పంచాయతీ పరిధిలో ఉదయగిరి సబ్ ఎస్సై దిప్తీ కరంత్ ఓ వ్యక్తి వద్ద ఉన్న ఎనిమిది మద్యం బాటిళ్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కోమల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి వద్ద 8 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మర్రిపాడు : స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓలు జ్యోతి, ధనలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. భోజన నాణ్యతను పరిశీలించారు. రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు.

బోధన మెరుగుపడాలి



కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులు

వరికుంటపాడు : ఉపాధ్యాయుల బోధన మెరుగుపడాలని ఎంఈఓ రమణయ్య అన్నారు. మండలంలోని వరికుంటపాడు, తిమ్మారెడ్డిపల్లె ఉన్నత పాఠశాలల్లో జరిగిన కాంప్లెక్స్ సమావేశాల్లో మంగళవారం పాల్గొని, మాట్లాడారు. కాంప్లెక్స్ సమావేశాలు ఉపాధ్యాయులకు విజ్ఞాన అనుభవ కేంద్రాలుగా ఉపయోగపడుతాయన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత

ఆత్మకూరు : ఆత్మకూరు స్టేషన్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎస్సై సాయిప్రసాద్ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున రెండు టిప్పర్లు ఇసుక లోడ్ చేసుకుని నెల్లూరుపాళెం మీదుగా వెళ్తుండగా ఎస్సై సాయిప్రసాద్ వాటిని ఆపి పరిశీలిస్తూ సరైన పత్రాలు లేకపోవడంతో స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

అనుమసముద్రంపేట : బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. ఏఎస్‌పేటలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోర వికాస్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. హెచ్‌ఎం హరికృష్ణ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి

విద్యతోనే మహిళా సాధికారత

సోమశిల : ప్రతి మహిళ చదువుకోవడం ద్వారానే సాధికారత సాధ్యమని అనంతసాగరం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం బట్రెడ్డి లక్ష్మీప్రసన్న అన్నారు. స్థానిక లైబ్రెరీలో జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో ఆమె మంగళవారం పాల్గొన్నారు. తొలుత ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల తొమ్మిదో తరగతి విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు.

• **చేజర్ల :** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చేజర్లలోని మానస ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తొలుత ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి పి.కల్పన పాల్గొన్నారు.



సోమశిల : ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళి

• **వింజమూరు(ఉదయగిరి) :** స్థానిక గ్రంథాలయ ఆవరణలో మంగళవారం మహిళలకు ముగ్గులు, అల్లికల పోటీలు నిర్వహించారు. సర్పంచ్ ఎస్.సుజన పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి జ్యోతి కొండయ్య, గ్రామ పెద్ద మద్దూరు రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో లాభాలు

సీతారామపురం : రైతులు ఆధునిక పద్ధతులను అవలంబించి సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి అన్నారు. అయ్యవారిపల్లిలో రైతులకు నిర్వహించిన శిక్షణా శిబిరంలో మంగళవారం ఆమె పాల్గొని, మాట్లాడారు. సేంద్రియ ఎరువులను వినియోగించడం ద్వారా రసాయన ఎరువులు, పురుగు మందుల ఖర్చులను తగ్గించుకోవాలన్నారు. ఏఓ చెన్నారెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జయశ్రీ, వీఏఏ నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

• **బిట్రగుంట :** బోగోలు, ఎస్వీపాళెం పంచాయతీల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ కావలి సహాయ సంచాలకుడు సీహెచ్ నాగరాజు, మండల ఏఓ విజయలక్ష్మి రబీ సీజన్‌లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి, నారుమడి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యం తదితర అంశాలను వివరించారు. వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, దరఖాస్తు చేసుకునే విధానాలపై అవగాహన కలిగించారు.

• **ఉదయగిరి :** మండలంలోని కృష్ణంపల్లి, శకునాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో వరి పొలాలను పరిశీలించి కలుపు యాజమాన్యం, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. నీటి యాజమాన్యం, కలుపు యాజమాన్యం గురించి జిల్లా వనరుల అధికారి శైలజాకుమారి వివరించారు. ఏఓ ఆంజనేయులు నాయక్ పాల్గొన్నారు.

• **మర్రిపాడు :** మండలంలోని సింగనపల్లి, కంపసముద్రం గ్రామాల్లో మండల ఏఓ రామ్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఓబయ్య, డాక్టర్ విజయ్‌కుమార్ నాయక్ పాల్గొని వరి, జొన్న సాగులో మెళకువలను తెలిపారు. పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా జొన్న సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు వెంకటేశ్వర్లు, సాంబ, వీఏఏలు రామకృష్ణ, శ్రావణి పాల్గొన్నారు.

• **సోమశిల :** అనంతసాగరం మండల పరిధిలోని సోమశిల, పడమటికంభంపాడు గ్రామ రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ శ్రీధర్‌రెడ్డి పలు సూచనలు చేశారు. ప్రధాన పొలంలో ఎరువులు, జీవన ఎరువుల వాడకం గురించి తెలిపారు. రైతులు పెంచలరెడ్డి, ఈశ్వరయ్య ఉన్నారు.

• **వరికుంటపాడు :** మండలంలోని జి.కొండారెడ్డిపల్లి, యర్రంరెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏడీఏలు మారుతీదేవి, లక్ష్మీ మాధవి, శైలజాకుమారి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సురేఖదేవి, ఏఓ రవికుమార్‌లు క్షేత్ర సందర్శన చేశారు. వరి, మినుము, మిరప పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సహాయకులు పవన్ కుమార్, ఆదిత్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

శైవక్షేత్రాల్లో పూజలు



సంగం : కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా తిరుమనకొండలో కొలువైన కాశీవిశ్వేశ్వరునికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగమేశ్వరుని ఆలయంలో బంకమట్టితో తయారు చేసిన వెయ్యి శివలింగాలకు విశేష పూజలు జరిపారు.

బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవం



ఆత్మకూరు : కెనరా బ్యాంక్ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని ఆదిఆంధ్రా పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. తొలుత బ్యాంక్ వ్యవస్థాపకుడు పాయ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యా జ్యోతి స్కీమ్ ద్వారా 6, 7 తరగతుల పిల్లలకు రూ.2700 స్కాలర్‌షిప్, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.5 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన్ను సన్మానించారు.